క్లుప్తంగా

నేడు, రేపు ఓటర్ల జాబితా సవరణకు అవకాశం

నాదెండ్ల: ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ – 2025లో భాగంగా శని, ఆదివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్, ఏఈఆర్వో ఏవీ రమణ చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మండల పరిధిలోని 57 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు హాజరై ఆధార్ లింక్ చేసుకునే అవకాశం, 18 ఏళ్లు నిండిన వారికి నూతన ఓటు హక్కు కోసం దరఖాస్తుల స్వీకరణ, తొలగింపులు, చేర్పులు, మార్పులు, బదిలీలు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

1న బ్రాహ్మణ సేవా సంఘం వనసమారాధన



వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం పీవీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో డిసెంబరు 1వ తేదీన కార్తీక మాస వన సమారాధన మహోత్సవ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీ సురేష్‌బాబు మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు అభిషేకం, 10 గంటలకు మహిళల కుంకుమార్చన పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో పురోహితులు యడవల్లి శ్రీనివాస శర్మ, సంఘ పెద్దలు జి. మాధవరావు, గాలి శ్రీకృష్ణయ్య, దీక్షితులు, శ్రీనివాసరావు, శంకరరావు, బి.రవికుమార్, నాగేశ్వరరావు, దేవులపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): బైక్ దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన 8 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో వినుకొండ రూరల్ సీఐ బి. ప్రభాకర్, ఎస్‌ఐ బి.వి.కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం... నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామానికి చెందిన లింగం యలమంద, కొమిరిశెట్టి రామాంజనేయులు బైక్‌లను దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వినుకొండ, పరిసర ప్రాంతాల్లో బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు రావడంతో సమాచారం మేరకు ఇరువురి నిందితులను ఈ నెల 21వ తేదీన ఐనవోలు గ్రామ శివారులో పట్టుకొని విచారించారు. ఒక సంవత్సరాల కాలం నుంచి బైక్‌లను దొంగిలించారని, వారి వద్ద నుంచి 8 బైకులను స్వాధీనపరచుకోవడమైందని తెలిపారు.

గల్లంతైన బాలిక మృతదేహం లభ్యం



వినుకొండ(నూజెండ్ల): ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామం వద్ద సాగర్ కెనాల్‌లో గల్లంతైన యామిని (11) మృతదేహాన్ని రెస్క్యూ టీం శుక్రవారం ఉదయం వెలికి తీశారు. సాగర్ కెనాల్‌లో మరో బాలిక కావ్య (7) మృతదేహం మాత్రం ఇప్పటికీ ఆచూకీ దొరకలేదు. పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన అధికారులు



శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యలు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందించాలన్నారు. ల్యాబ్ పరీక్షలు, ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందే వైద్యసేవలు వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది పనితీరును రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో చేరిన రోగులతో మాట్లాడి వైద్యశాల్లో అందుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి రావిపూడి రమ్య, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ సతీష్ ఉన్నారు.

ఓటర్ల నమోదు, సవరణలకు అవకాశం

చిలకలూరిపేట: ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2025లో భాగంగా శని,ఆదివారాలలో పురపాలక సంఘ పరిధిలోని బూత్ లెవెల్ అధికారుల సమక్షంలో స్పెషల్ క్యాంపైన్ నిర్వహిస్తున్నట్లు సహాయ ఓటర్ల నమోదు అధికారి, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమం సంబంధిత రోజుల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. కావున 18 సంవత్సరములు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడంతో పాటు, తొలగింపులు, ఓటు కార్డు నందు సవరణలు చేసుకోవచ్చన్నారు.

శిథిలావస్థలో గణపవరం గ్రంథాలయం

- పుస్తక పఠనానికి నేటి తరం దూరం
- వార్తాపత్రికలకే పరిమితమైన విజ్ఞాన భాండాగారం



గణపవరం గ్రంథాలయ భవనం



భవనంపై మొలచిన రావి మొక్కలు

నాదెండ్ల: ఒకప్పుడు సమాచారం, విజ్ఞానాన్ని ప్రజల చెంతకు చేర్చి వారిని చైతన్యపరిచిన గ్రంథాలయాలు నేడు పాఠకుల ఆదరణ కరువై కునారిల్లుతున్నాయి. టీవీ, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ విప్లవం కారణంగా ప్రజల్లో పుస్తక పఠనం తగ్గిపోతోంది. కేవలం న్యూస్ పేపర్ల వరకే గ్రంథాలయాలు పరిమితమయ్యాయి. గతంలో గ్రంథాలయాల్లో వార్తా పత్రికలతోపాటూ వారపత్రికలు, నవలలు, చరిత్ర, ఇతర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారం గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండేది. అప్పట్లో గ్రంథాలయాల్లోనే వార్తలను ప్రజలకు నేరుగా చేరువ చేసేందుకు రేడియోలను కూడా ఏర్పాటు చేశారు. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోని గ్రంథాలయం నేడు శిథిలావస్థకు చేరింది.

దానం చేసిన దాత స్థలంలోనే...

1958లో అప్పటి సర్పంచ్ వలేటి నారాయణ చౌదరి ఆధ్వర్యంలో వలేటి ఆదియ్య చౌదరి గారి కుమారుడు వీరయ్య దానం చేసిన స్థలంలో గ్రంథాలయాన్ని నిర్మించారు. కొన్నేళ్ళపాటూ గ్రంథాలయాలకు మంచి ఆదరణ లభించింది. అప్పట్లో పంచాయతీ కార్యాలయానికి భవనం లేకపోవటంతో పాలనా వ్యవస్థ ఇక్కడి నుంచే కొనసాగింది. ఆ తర్వాత పంచాయతీకి నూతన భవనం సమకూరింది. దీంతో గ్రంథాలయం పూర్తిగా పాఠకులకు సౌకర్యవంతంగా మారింది. ప్రస్తుతం ఈ భవనం రోడ్డుకు పల్లంగా ఉండి కొద్దిపాటి వానకే నీరు నిలుస్తోంది. భవనం పగుళ్ళిచ్చి ఎప్పుడు కూలుతుందోననేలా మారింది. భవనం చుట్టూ రావి మొక్కలు మొలిచి అపరిశుభ్రంగా ఉంది.

స్థానిక పన్నుల్లో 8 శాతం వాటా!

స్థానిక సంస్థలు ప్రజల నుంచి వసూలు చేసే ఆస్తి పన్నులో 8 శాతం గ్రంథాలయం సెస్ క్రింద జిల్లా గ్రంథాలయ సంస్థకు చేరుతుంది. గణపవరంలో 4605 గృహాలకు గాను ప్రతి ఏటా ఇంటి పన్ను రూపంలో రూ.53 లక్షలు వసూలౌతున్నాయి. ఇందులో 8 శాతం రూ.4,24,000లు గ్రంథాలయ సెస్సు క్రింద జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లిస్తున్నారు. కరోనాకు ముందు పంచాయతీ ఆదాయం సుమారు రూ.70 లక్షలకు పైగా ఉండేది. కరోనా అనంతరం స్థానిక కంపెనీలు మూతపడటంతో ఆదాయం తగ్గింది. అయితే సెస్ రూపంలో వసూలు చేస్తున్న ఆదాయంతో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాలను పునరుద్ధరించాలని, ప్రస్తుత విద్యార్థులు, యువతరం అభిరుచికి అనుగుణంగా గ్రంథాలయాలను సాంకేతిక పరికరాలతో అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ నిధులతోనే నిర్వహణ

గ్రామంలోని గ్రంథాలయంలో ప్రస్తుతం వార్తాపత్రికలు అందుబాటులో ఉన్నాయి. నూతనంగా పుస్తకాలు, నవలలు రాలేదు. పంచాయతీకి ఆదాయం తగ్గటంతో గ్రంథాలయ సెస్ నామమాత్రంగా వసూలవుతోంది. గ్రంథాలయంలో పనిచేసే సిబ్బందికి పంచాయతీ నిధుల నుంచే జీతాలు చెల్లిస్తున్నాం.

–ఎస్.మారుతిబాబు,
పంచాయతీ కార్యదర్శి

25న అయ్యన్న తాత ఉరుసు వేడుకలు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీఅయ్యన్న తాత ఉరుసు వేడుకలు ఈనెల 24 సాయంత్రం నుంచి ప్రారంభం అవుతాయని కమిటీ సభ్యులు పూరిమెట్ల ఖాశిం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూరిమెట్ల వంశీకులు సారథ్యంలో గత 100 సంవత్సరాల నుంచి అయ్యన్న తాత ఉరుసు వేడుకలు పార్టీలకు కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించుతున్నట్లు తెలిపారు.

24న సాయంత్రం గ్రామ పురవీధుల్లో జెండాలను మేళాతాళాలతో ఊరేగింపు జరుపుతామన్నారు. 25న చివరిరోజు మహిళలందరూ, భక్తులు అయ్యన్న తాత సమాధిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో అందరు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయాలన్నారు.

తాగునీటి సరఫరా బంద్

నరసరావుపేట: శాంతినగర్ నుంచి పట్టణానికి తాగునీరు తీసుకొచ్చే ప్రధాన పైపులైనుకు ఏర్పడిన లీకులను అరికట్టే నిమిత్తం ప్రజలకు రెండుపూటలా తాగునీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం, ఆదివారం ఉదయం పూటల్లో తాగునీరు సరఫరా చేయట్లేదన్నారు. ఆదివారం సాయంత్రం యధావిధిగా సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

నివాస గృహాలు ఖాళీ చేయాలంటూ నోటీసులు



నోటీసులు చూపిస్తున్న లబ్ధిదారులు

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలోని 56 కుటుంబాలకు చెందిన నివాస గృహాల వారిని ఖాళీ చేయాలంటూ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు గ్రామవాసీ అడపాల అనిల్ తీవ్రస్థాయిలో అవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నివాస గృహాలకు చెందిన వారందరు తమకు న్యాయం చేయాలంటూ తహసీల్దారు కె.సుజాతకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ఎంపీపీ స్కూలు ఎదురుగా గత కొన్ని సంవత్సరాల నుంచి నివాస గృహాలు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ పరంగా తాము ఇంటి పన్నులు చెల్లిస్తున్నామన్నారు. అందరు నిరుపేద కుటుంబాలకు చెందిన వారని వాపోయారు. ఈనెల 18న పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు ప్రభుత్వ నిబంధనల మేరకు తక్షణమే ఖాళీ చేయాలంటూ నోటీసులు అందజేశారన్నారు. సర్వే నంబరు 447, 632 భూమిలో ఆక్రమణలు గురయ్యాయని గ్రామానికి చెందిన పచ్చవ శివనారాయణ, శివాది వెంకయ్య ఇరువురు కలిసి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారన్నారు. జిల్లా కలెక్టరు నుంచి ఉత్తర్వులు అందాయని నివాస గృహాలవారందరూ ఇచ్చిన వినతి పత్రంపై తహసీల్దారు స్పందించ లేదని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పంచాయతీ రాజ్ మంత్రి కొణిదల పవన్‌కళ్యాన్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని అనిల్ వాపోయాడు.

26న ధర్నాను విజయవంతం చేయండి

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన ప్రజాసంఘాల నాయకులు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా, మహిళా వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు ఆవరణలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ నెల 26న స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్కు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించే ర్యాలీ, ధర్నా కార్యక్రమాలలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు శిఖినం సాంబయ్య, సాల్మన్‌రాజు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి శిలార్ మసూద్, కోశాధికారి శివకుమారి, రైతు సంఘం నాయకులు గోపాలరావు, స్వరూప్ పాల్గొన్నారు.


దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

చిలకలూరిపేట: న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాపా ఆదినారాయణ కోరారు. ఇటీవల న్యాయవాదులపై జరిగిన దాడులను నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో న్యాయవిద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి అత్యంత హేయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది గౌతంరెడ్డి ఇంట్లోకి పోలీసులు ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా ప్రవేశించి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు ఇలాంటి అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. తమిళనాడులో కన్నన్ అనే న్యాయవాదిని అత్యంత దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇటీవల జరిగిన సంఘటనలలో కఠిన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నక్కా రమేష్‌బాబు, పోతుల వెంకట్, మాదాసు భానుప్రసాద్, శివబాబు, వీరయ్య, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు వడియరాజుల కార్తిక వన సమారాధన



మాట్లాడుతున్న బత్తుల వెంకట స్వామి

సత్తెనపల్లి: వడియ రాజుల కార్తిక వన సమారాధనను విజయవంతం చేయాలని వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి పిలుపునిచ్చారు. భీమవరంలో నియోజకవర్గ స్థాయి వడ్డెర కుల ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటస్వామి మాట్లాడుతూ ఆదివారం భీమవరంలోని కాటి అంకమ్మ తల్లి దేవస్థాన కల్యాణ మండపంలో సమావేశం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఆత్మీయ అతిథిగా ఎమ్మెల్సీ, మాజీ డీజీపీ చంద్రగిరి ఏసురత్నం పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వడ్డెర కులస్తులందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. సంఘ నాయకులు గుంజి విజయ్‌కుమార్, కొమెర వీరాంజనేయులు, ఒంటిపులి నాగేశ్వరరావు ఉన్నారు.

రేపు బ్రాహ్మణ కార్తిక సమారాధన

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జు ననగర్‌లో గల సత్యధ్యాన మందిరంలో ఈ నెల 24న పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం, సత్యధ్యాన మందిరం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సుపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది గిరిరాజు నాగేశ్వరరావు, ముప్పాళ్ళ వ్యాపారి కేశనుపల్లి రాఘవయ్య, వరలక్ష్మి దంపతులకు సన్మానం ఉంటుందన్నారు. బ్రాహ్మణ సోదరులు పాల్గొని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 8గంటలకు కార్యక్రమం ప్రారంభమై, మధ్యాహ్నం విందు ఉంటుందని తెలిపారు.

26న కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయం 23వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 26న గ్రామస్తులు దాతల సహకారంతో ఘనంగా నిర్వహించుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సనిశెట్టి సాంబశివరావు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్తిక ఏకాదశి పర్వదినం సందర్భంగా అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో దంపతులచే శాంతి కల్యాణం వేడుకలు ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్, కొల్లిపర రమేష్‌శర్మ సారథ్యంలో జరుగుతాయన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నదాన సంతర్పణ జరుగుతుందన్నారు. రాత్రి శ్రీబ్రహ్మం గారి పౌరాణిక నాటకం ప్రదర్శన, భజన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించుతున్నట్లు తెలిపారు. మండల ప్రజలందరూ ఈకార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఆయనతో పాటు ఆలయ ధర్మకర్త రెడ్డి జ్వాలా నరసింహారావు, కాకాని రామాంజినేయులు, పాలడుగు వెంకట నరసింహారావు, గట్టుపల్లి సత్యనారాయణ, కర్రె పెద అంజయ్య, చెరుకూరి ప్రసాదరావు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నరసరావుపేట ఈస్ట్: నానాటికీ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు కోరారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శుక్రవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన సదస్సులో వన్‌టౌన్ సిఐ ఎం.వి.చరణ్, మహిళా ఎస్‌ఐ అరుణ, నేషనల్ సెక్యూరిటీ సైబర్ క్రైమ్ డేటాబేస్ అధికారి కొత్తపల్లి ప్రదీప్ పాల్గొని సైబర్ నేరాలు, వాటి నుంచి రక్షణ పొందే విధానాలను విద్యార్థులకు వివరించారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీ నెంబర్లను ఎట్టి పరిస్థితుల్లో మరొకరికి తెలియచేయకూడదని స్పష్టం చేశారు. అనుమానిత మెసేజీలు ఫోన్‌కు వచ్చిన వెంటనే సైబర్ క్రైమ్ అధికారులకు తెలియచేయాలని సూచించారు. ఎదుటి వ్యక్తి బలహీనతలను ఆసరాగా చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తులకు ఎవరూ తమ ఫోన్లు ఇవ్వరాదని తెలిపారు.

అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి



బొల్లాపల్లి : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని ఎంఈవో -2 కె.పార్వతి సూచించారు. మండలంలోని హనుమాపురం, చక్రాయపాలెం, పాపాయపాలెం పాఠశాలలను శుక్రవారం ఆమె సందర్శించారు. హనుమాపురంలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఉపాధ్యాయులు బోధనతో పాటు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.74 లక్షల ఎరువుల నిల్వలు సీజ్



చాగంటివారిపాలెం (ముప్పాళ్ళ): రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేర ఎరువుల దుకాణంలో నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేని రూ.3,74,330 విలువ గల ఎరువుల నిల్వలను సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.శివాజీ శుక్రవారం తెలిపారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఉన్న అంజిరెడ్డి సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణంలో రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా దుకాణంలోని పురుగు మందుల నిల్వలు, సేల్ రిజిష్టర్, ఇన్వాయిస్‌లు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు చూపించలేకపోవటంతో సంబంధిత నిల్వలను సీజ్ చేశారు. తనిఖీల్లో రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్ ఏఓ చల్లగుండ్ల ఆదినారాయణ, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదపు కునుకు



కండలను కరిగించి చెమట చుక్కలు చిందించి అలసి-సొలసి పోయాడో.. మద్యం మత్తులో సొమ్మసిల్లి వాలిపోయాడో తెలియదుగానీ డివైడర్ పై ప్రమాదపు అంచున ఇలా సేద తీరుతున్నాడో యువకుడు. నరసరావుపేటలోని ప్రధాన రహదారిలోని మల్లమ్మ సెంటర్ లో ప్రతి నిత్యం డివైడర్ పై పదుల సంఖ్యలో ఇలా నిద్ర పోతున్నారు. వీరిలో కొందరు యాచకులైతే, మరికొందరు కూలీలు, ఇంకొందరు మందుబాబులు. ఈ రోడ్డుపై నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. నిద్ర మత్తులో డివైడర్ పై నుంచి జారిపడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. సంబంధిత అధికారులు ఈ సమస్యకు సానుకూల పరిష్కారంచూపి జరగబోయే ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉంది.

– నరసరావుపేటటౌన్

హద్దురాళ్లు తొలగించాలి



రైల్వే అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నరసరావుపేట రూరల్: భూమిని సేకరించకుండా రైల్వే శాఖ తమ భూమిలో ఏర్పాటుచేసిన హద్దురాళ్లను తొలగించాలని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన రైతులు రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పించారు. జొన్నలగడ్డ సమీపంలోని అండర్ పాస్‌ను రైల్వే అధికారి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. గుంటూరు–గుంతకల్లు రైల్వే లైన్ డబ్లింగ్‌లో భాగంగా రైల్వే శాఖ తమకు అవసరమైన భూములను రైతుల నుంచి సేకరించింది. అయితే పలువురి రైతుల భూములను సేకరించకుండానే ఆయా రైతుల భూముల్లో హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. దీనిపై రైల్వే శాఖతో పాటు రెవిన్యూ అధికారులను పలుమార్లు గ్రామస్తులు కలిసి తమకు జరిగిన నష్టాన్ని వివరించారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో శుక్రవారం మరోమారు రైల్వే అధికారిని కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన రైల్వే అధికారి వెంటనే సర్వే చేయించి హద్దురాళ్ల రికార్డులను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మునుమాకలో ప్రత్యేకాధికారి పర్యటన



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న సూర్యప్రకాష్‌రెడ్డి

రొంపిచర్ల: మండల ప్రత్యేక అధికారి కె. సూర్యప్రకాష్ రెడ్డి స్పెషల్ ఆఫీసర్స్ డే పురస్కరించుకొని మండలంలోని మునుమాక గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాన్ని, హెల్త్‌క్లినిక్ సెంటర్, మండల పరిషత్ పాఠశాలను సందర్శించారు. హెల్త్ క్లినిక్ సెంటర్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంతమంది రోగులకు వైద్యసేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ప్రత్యేక అధికారికి బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సచివాలయ పని చేయు వేళల్లో ఎలాంటి అలసత్వం వహించినా ఆ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులతో పలు విషయాలపై సమీక్షించి సూచనలు చేశారు. అలాగే పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకంలో తయారు చేసిన పదార్థాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా ప్రతి రోజు మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందే విధంగా పర్యవేక్షించాలన్నారు.

ఉపాధి పనుల ప్రణాళికపై గ్రామ సభలు

రాజుపాలెం: మండలంలోని కొత్తబోధనం, కోటనెమలిపురి, బీరవల్లిపాయ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. 2025–26కు సంబంధించిన పనుల గుర్తింపు ప్రణాళికలో గ్రామ సభల్లో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో చెవుల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ అల్లాభక్షి, ఉపాధి సిబ్బంది, మేట్‌లు పాల్గొన్నారు.